వాత్సల్యానికి పొలిమేరలు

# తల్లి కోరిన కోరిక

జొన్నలగడ్డ రామచంద్రరావు

ప్రసాద్ యింట్లో ఒంటరిగానే వున్నాడు. మరెవ్వరూ లేరు. భార్యకు మూడు రోజుల నుంచీ జ్వరం ఎక్కువయింది. డాక్టరు 'కమల చనిపోయింది' అని చెప్పేసరికి మానవ నిర్మితమైన యంత్రంలా కళ్లు అప్పగించి అలా చూస్తున్నాడు ప్రసాద్. కళ్లనుండి నీరు రావటంలేదు. కాని ఒక సంజ్ఞనుండి మాత్రం తప్పించుకోలేక పోతున్నాడు. ఆ సంజ్ఞా వాచకంయొక్క బాధ్యత అంతర్గతంగా ఉత్పన్నమౌతున్న అంతర్వాణిని అణచివేస్తూంది.

తల్లికి జబ్బుగా ఉన్నదని తెలిసి మణి మద్రాసునుంచి వచ్చాడు. తల్లి మంచంవద్దకు పరుగెత్తి ఆ శవంమీదపడి యేడుస్తున్నాడు. దుఃఖసముద్రం కట్టలు తెంచుకుని ప్రవహిస్తూంది పాపకూ లేత హృదయంనుంచి. స్నేహితులు బంధువులు పలికే ఓదార్పు మాటలు వినిపించుకోకుండా తల్లిని పదే పదే పిలుస్తూ ఆమె చల్లని నుదురును చెక్కిళ్ళను ముద్దుపెట్టుకుంటూ యేడుస్తున్నాడు చెదిరిన మనస్సుతో. కొంత సేపటికి శవం కర్మభూమికి చేర్చబడింది. ప్రసాద్ ఒక ప్రక్కనుండి దహనపేటికను పరిశీలిస్తున్నాడు. ఆ శరీరం, బొమికలు తన సంజ్ఞా వాచక చిహ్నాలు, పూర్తిగా దహించబడ్డాయి.

మూడురోజులకల్లా బంధువులంతా ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. మణిని అతి కష్టంమీదగాని పంపించలేకపోయాడు మద్రాసు. తన భుజాలమీద వేయబడ్డ బాధ్యతా సమస్యల నిర్వహణగూర్చి ఆలోచిస్తూ ఆఫీసుకు నడిచాడు ప్రసాద్. మూడు రోజులనుంచీ ఆలోచనా సముద్రంలో మునిగి దరిదాపు కానకుండా యీదులాడుతున్నాడు. మూడవరోజు యింటికి వచ్చేసరికి లోలోపల ఏదో నమిలివేస్తున్నట్టు తోచింది.

ఇంట్లోవుండే ప్రతి చిన్నవస్తువు కమలను గురించి చెప్తున్నట్టే వుంది. కాన్వెంటు నుంచి తిరిగివచ్చి ఆ పేము కుర్చీలో కూర్చుని పిల్లల ఎక్సర్‌సైజు పుస్తకాలు దిద్దుకొనేది. ఇంకా కొన్ని చరిత్ర, భూగోళం పుస్తకాలు, సీమ సున్నం ముక్కలు అక్కడే ఉన్నాయి. ఇదే దీన్లోనే కాఫీ యిచ్చేది. అబ్బా! ఎంత బాగుండేది. అలా ఎప్పటికీ ఎవ్వరూ తయారు చేయలేరు. కోటు తగిలించడానికై వంకె దగ్గరకు వెళ్లేసరికి అక్కడ ఆమె చీర చక్కగా మడత బెట్టి తగిలించి ఉంది.

కమలను స్ఫురణకుతెస్తూ, తన్ను అమితంగా బాధపెడుతున్న యీ వస్తువుల మధ్య ఉండలేక పడకగదిలోకి వెళ్ళేడు. చీకటి తన విచారాన్ని ఎక్కువచేసింది. భయంకర తుఫాను నెదుర్కొని ఒక విషాదాంత సంఘటనకు లోనై విషపూరితమైన తన జీవితసమస్య దుర్భరంగా వుంది.

తాను నిద్రించలేదు. లేచి రెండవ గదిలోకి వెళ్ళి అక్కడ బరువుగా కూలబడ్డాడు. ఆలోచనలలో పిసుగెత్తిన తన మనస్సు ఒకటి బోధిస్తోంది. ఇకమీద తను ఒంటరిగా జీవితం గడపాలని.

కమల...కమల...అని బిగ్గరగా అరిచాడు. చివరకు చేతులు మొఖానికి కప్పుకొని దుఃఖిస్తున్నాడు. 'నువ్వు లేకుండా నేనేం చేయగలను కమలా!' శక్తిసామర్థ్యాలను విస్తృతం చేసి నడిపించేది. తన సంపాదన చాలనిదే కాని తన తెలివితేటలవల్ల అన్నీ ప్రశాంతంగా చక్కదిద్దేది.

'నువ్వు లేకుండా నేనేం చేయగలను! బ్రతకడమెలా? మణి యేమౌతాడు!' అకస్మాత్తుగా చీరనుంచి ఒక ధ్వని వినవచ్చింది. తల పైకెత్తాడు. ఏమిటి తను చూచింది!

కళ్ళు నీళ్ళు తుడుచుకొని—

ఏమిటి తనముందర? కాలుమీద కాలు వేసికొని ఆ కుర్చీలో కూర్చున్నది కమల కాదు గదా? ఎంతటి కష్టాలైనా సరే ఎదుర్కొనే శక్తినిచ్చే ఆ చిరునవ్వు కాదుగదా? నల్లటి లేత

ణమైన కాంతి తనకేసి కాదుగదా ప్రసరించేది?

కాదు. కాదు. ఆమె కండ్లే. అదే కాంతి.

'ప్రసాద్' హీనస్వరంతో అంది. 'ప్రసాద్, నువ్వు నాకొక వాగ్దానం చేశావు' ప్రసాద్ నోటినుండి మాటరావటంలేదు. కళ్ళనుంచి నీరు ధారగా ప్రవహిస్తున్నాయి. 'ప్రసాద్, నీవు మణి చదువుకు భంగంరాకుండా చూస్తానని మాటయిచ్చావు కదూ. నీకు తెలుసు. నాకు జీవితంలో మిగిలిపోయిన కోర్కె అదొక్కటే అని. మణి డాక్టరౌతాడు. తన జీవితాన్ని ఆ బాధులకు బాధితులకు సేవచేసేందు కుపయోగిస్తాడు. నీకిది సుళువైన పనికాదని తెలుసు. కాని తప్పదు. వాడికి సహాయపడాలి.'

'ఔను కమలా! తప్పక...'

'మధ్య మాట్లాడకు. నన్ను మాట్లాడనివ్వు'

కొంతసేపటికి మళ్ళీ చెప్పటం ప్రారంభించింది. మణికి నాకోర్కె తెలుసు. వాడు మంచి డాక్టరౌతాడు. కాని నీ సహాయం అవసరం.'

తల్లీ కుమారుల మధ్యనున్న ప్రేమ ఇంత గాఢమైందని తానేనాడు తెలిసికోలేకపోయాడు. అర్థంచేసికొనడం కూడా కష్టం. చిన్ననాటినుండి మణిని డాక్టర్ని చెయ్యాలని ఆమెకోర్కె. ఊహ తెలిసినప్పటినుంచి మానవసేవ, నీతి మొదలైన విషయాలను గురించి చెపుతూండేది వాడికి. మణి మద్రాసులో డాక్టరు కోర్సు చదువుతున్నాడు. ఇది రెండో సంవత్సరం.

'ఔను కమలా నీ ఆశయం సాధించడానికి నా సర్వశక్తులు వినియోగిస్తా. మణి తప్పకుండా డాక్టరౌతాడు. కాని కమలా నన్ను వదలి ఎందుకు వెళ్ళావు. నేను ఒంటరిగా ఎంతో కాలం ఉండలేను.'

ఆమె మొఖాన చిరునవ్వు తొణికిసలాడింది.

'లేదు నేనెంతో కాలం ఉండలేను. వీలైనంత త్వరగా ఉగాకని కాస్తా చేసి, నీదగ్గరకు వచ్చేస్తాను. మాట్లాడవేం కమలా? నాకు తెలుసు నువ్విక్కడున్నావని. ఆ కుర్చీలో నా ముందర. నాకు తెలుసు నా విచారం పోగొట్టడానికి వచ్చావనికూడా తెలుసు. ప్రతిరోజూ ఇలాగే వస్తావా కమలా? నీకు తెలుసు నువ్వు లేకుండా నేను జీవించడం కష్టమని.'

'ఇంకో సంగతి. నేను మణిని కాలేజీలో చదివించగల శక్తిగలవాడినేనా? నాకు వచ్చే జీతం ఎంతో నీకు తెలుసు. ఎంతో మితంగా వుంటేగాని ఆ వచ్చే అరవై సరిపోవు. మరి ఇరవై రూపాయలు ఇన్సూరెన్సు కట్టాలా? ఇక మణికి ఏం పంపగలనని నీవూహ. హాస్టల్‌కి, కాలేజీకి, పుస్తకాలకు తదితర ఖర్చులకు ఎంత అవుతుందో నీకు తెలుసు. ఇంతకు మునుపైతే నీకు వచ్చే జీతమంతా వాడికి పంపేదానివి. కాబట్టి ఎలాగో సరిపెట్టుకొనేవాళ్ళం' ఆమె వింటున్నట్లే బిగ్గరగా చెప్పుకున్నాడు.

ప్రసాద్ కమల కేసి చూసేసరికి ఆమె ముఖం నల్లబడి కళాహీనంగా వుంది.

'విచారపడకు కమలా! నీ ఆశ అడియాశ చేయను. కాని డబ్బెలా సంపాదించ గలనా అని ఆలోచిస్తున్నా.'

చాలీ చాలని జీతంలో మణికి నెలనెలా డబ్బు పంపించటం అతి కష్టమై పోయింది. కాని ఆమెకు చేసిన వాగ్దానం ఎలా నెరవేర్చడం? ఆరు నెలలనుండి ఎంతో కష్టంమీద జరుపుకుంటూ వచ్చాడు. పరిస్థితులు విషమించాయి. తన శక్యం గాకుండా వుంది.

రోజూ ఆ కుర్చీముందు కూర్చొని కమలతో మాట్లాడడం పరిపాటయిపోయింది. కాని నేడేమీ మాట్లాడడం లేదు. తాను కమలకు చేసిన వాగ్దానం అతిక్రమించే పరిస్థితులొచ్చాయే అని విచారిస్తున్నాడు. అక్కడ చాలాసేపు కూర్చున్నాడు, కాని తన మనస్సు ఒక నిశ్చయానికి రాలేకపోయింది. అకస్మాత్తుగా ఒక ఆలోచన తట్టింది సంతోషంతో బిగ్గరగా అరచాడు.

'ఔను కమలా అదే మార్గం. అది అన్నింటికీ మంచిది' మార్గాన్వేషణంలో బాధపడుతూన్న ప్రయాణీకుడు గమ్యస్థానం చేరుకున్నప్పుడు పొందే ఆనందం పొందాడు.

రెండవరోజు మణికి టెలిగ్రాం వచ్చింది. 'ఐదువేలరూపాయలు ఇన్సూరెన్సు కంపెనీకి వెళ్ళి తెచ్చుకో, ఆ డబ్బుతో చదువు పూర్తి చేసి నీ తల్లికోర్కె నెరవేర్చు.'